
ప్రదర్శనను తిలకిస్తున్న కలాం, మన్నార్‌జవహర్


క్రికెట్ అకాడమిని ప్రారంభిస్తున్న బాలాజీ


దండి యాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

# సామాజిక సేవే ధ్యేయం

సామాజిక సేవలో గాంధీ ఫౌండేషన్ ముందంజలో ఉంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, పాలిథిన్ కవర్ల వినియోగంతో కలిగే నష్టాన్ని వివరించడం, పర్యావరణ పరిరక్షణ, మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్ని జాగృతం చేస్తోంది.

-గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే


నడకతో వ్యాధుల నయం ఊరేగింపులో పాల్గొన్న ఎస్వీ శేఖర్ తదితరులు

గాంధీ ఫౌండేషన్‌ను గుమ్మిడిపూండికి చెందిన రాజేష్ (32) 2008లో స్థాపించారు. ఇక్కడే ప్రధాన కార్యాలయ భవనం ఉంది. ఫౌండేషన్‌లో 594 మంది యువకులు సభ్యులుగా ఉన్నారు. రాజేష్ బాల్యం నుంచి బాపూజీని దైవంగా భావించి పూజిస్తారు. పెద్దయిన తర్వాత ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ఫౌండేషన్ స్థాపించి సమాజ సంక్షేమానికి కృషి చేస్తున్నారు. మద్యపానం, ధూమపానం ద్వారా కలిగే కీడును వివరించే, మహిళాభివృద్ధికి తోడ్పడే అవగాహన శిబిరాలను తరచూ నిర్వహిస్తున్నారు. గాంధీ జయంతి, వర్ధంతి రోజుల్లో చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులను మంచిపౌరులుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు.

**క్రీడాభివృద్ధికి అకాడమీ:** గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుమ్మిడిపూండిలో ఎంఎల్ఆర్ పేరిట క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేశారు. భారత జట్టు మాజీ సభ్యుడు వెంకటపతి బాలాజీ అకాడమీని ప్రారంభించారు. గ్రామీణ యువకులకు పోటీలు నిర్వహిస్తూ గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

**ప్రదర్శనకు అపూర్వ స్పందన:** దేశం స్వాతంత్ర్యం పొందేందుకు వేలాది మంది అశువులు బాసిన విధానాన్ని తెలిపేందుకు రాజేష్ చెన్నైలో ఇటీవల ప్రదర్శన ఏర్పాటు చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, అన్నావర్సిటీ ఉపకులపతి జవహర్‌మన్నార్, పలువురు సినీ నటులు హాజరై రాజేష్‌ను ప్రశంసించారు. వందలాది మంది యువకులు ప్రదర్శనను తిలకించి గాంధీజీ ఆశయాల సాధనకు తమ వంతు కృషి చేస్తామని పుస్తకంలో సంతకాలు చేశారు.

## కంప్యూటర్ శిక్షణ

నేటి కాలానికి తగ్గట్టు గ్రామాల్లోని పేద విద్యార్థులు లబ్ధిపొందాలనే ఉన్నత ఆశయంతో అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా కంప్యూటర్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. 20 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

## ప్రదర్శనలతో లక్ష్య సాధన

ఏ చిన్న విషయమైనా ప్రదర్శనలతో ఇట్టే ప్రజలకు తెలియజేయవచ్చని గ్రహించిన ఆ యువకుడు ఆ దిశగా పయనిస్తున్నారు. దండి సత్యాగ్రహం జరిగిన తీరును నేటితరానికి తెలియజేసేందుకు విద్యార్థులతో ఏటా ఊరేగింపు నిర్వహిస్తున్నారు. వ్యాధులు లేని జీవితానికి కాలినడకే శ్రేయస్కరమని తెలిపేందుకు ఇటీవల భారీ ప్రదర్శన నిర్వహించారు. హాస్య నటుడు ఎస్వీశేఖర్ మరి కొందరు పాల్గొంచుకుని ప్రదర్శన విజయవంతం చేశారు.

## ఆశయాలు నెరవేర్చడమే లక్ష్యం

రాజేష్ గుమ్మిడిపూండిలో నివాసం ఉంటున్నారు. తండ్రి ఎం.లోకనాధన్. తల్లి లక్ష్మీదేవి. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. చెన్నైలోని హిందుస్థాన్ పెట్రోలియం సంస్థలో ఉద్యోగి. నవ సమాజ స్థాపనకు గాంధీ ఎనలేని కృషి చేశారని ఆ దిశగా తాను ముందడుగు వేస్తున్నట్టు 'న్యూస్‌టుడే'తో అన్నారు. తన వేతనాన్ని ఫౌండేషన్ కార్యకలాపాల నిర్వహణకు వెచ్చిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలకు పలు సన్మానాలు పొందారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తనను స్వయంగా ప్రశంసించడం ఎప్పటికీ మరచిపోలేనని రాజేష్ తెలిపారు.